ONE click
ePaper
www.shanmukhavelugu.com

షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 195    శుక్రవారం 24 జూలై 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## ఎప్పుడైనా మీ ఇష్టమే.. చర్చలకు ప్రభుత్వం సిద్ధం జితేంద్ర సింగ్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 23)

నీట్ పేపర్ లీకేజీపై ఆందోళనలు ఉద్ధృతమైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు ముమ్మరం చేసింది. చర్చలకు రావాలని విద్యార్థులు, కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) నేతలను మరోసారి ఆహ్వానించింది. 'మీకు అనుకూలంగా ఉండే సమయంలో ఎప్పుడైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు.

"ఆందోళనకారులకు కేంద్రం నాలుగు ప్రతిపాదనలు చేసింది. వాటిపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆందోళనకారుల తరపున కొందరు వచ్చి ప్రభుత్వంతో చర్చించవచ్చు. మీరు ఎప్పుడైనా రావొచ్చు. ప్రభుత్వం తరపున నేను, జేపీ నడ్డా చర్చలో పాల్గొంటాం" అని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. జేపీ నడ్డా కార్యాలయంలోగానీ, ఆయన నివాసంలోగానీ చర్చిద్దామన్నారు. తొలుత చర్చ ప్రారంభిస్తే.. క్రమంగా సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

**కన్నాట్ ప్లేస్‌లో 6:30కే దుకాణాలు బంద్**

సీజేపీ ఆందోళనల నేపథ్యంలో న్యూదిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీటీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆందోళనల తీవ్రత అధికంగా ఉన్న కన్నాట్ ప్లేస్ (సీపీ) ప్రాంతంలో గురువారం సాయంత్రం 6:30కే దుకాణాలు, కార్యాలయాలు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకు యజమానులు ▶2లో

## పేపర్‌లీక్‌పై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు.. ఆందోళనల వేళ మోదీ బిగ్ మెసేజ్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 23)

నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ దిల్లీలోని జంతరమంతర్ వద్ద మొదలైన నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ మొదలుపెట్టిన ఈ ఆందోళనలకు విపక్షాలు కూడా తోడయ్యాయి. ఈ లీక్ అంశంపైనే పార్లమెంట్‌లో వాయిదాలపర్వం కొనసాగుతోంది. ఈ పరిణామాల వేళ ప్రధాని నరేంద్రమోదీ గురువారం కీలక ప్రకటన చేశారు. పరీక్ష పత్రాల ▶2లో

## జగన్ గందరగోళం సృష్టిస్తున్నారు

**అమరావతిపై మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**అమరావతి అభివృద్ధిని జగన్ కళ్లారా చూడాలన్న గొట్టిపాటి**



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)

రాజధాని విషయంలో వైసీపీ అధినేత జగన్ అనవసర గందరగోళం సృష్టిస్తూ ప్రజలను తికమక పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. జగన్ కనీసం ఒక్కసారైనా నేరుగా వచ్చి అమరావతిలో జరుగుతున్న ▶2లో

# అమరావతిలో పీఎన్‌బీ క్వాంటం హబ్...

- సీఎం చంద్రబాబు సమక్షంలో కీలక ఒప్పందం
- అమరావతిలో క్వాంటం ఫైనాన్స్ హబ్ ఏర్పాటు చేయనున్న పీఎన్‌బీ
- రాష్ట్ర ప్రభుత్వం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య కీలక ఒప్పందం
- దేశంలోనే ఇలాంటి హబ్ ఏర్పాటు చేస్తున్న తొలి బ్యాంకుగా పీఎన్‌బీ
- బ్యాంకింగ్ సైబర్ భద్రత, మోసాల నివారణే ప్రధాన లక్ష్యం
- డిజిటల్ అక్షరాస్యత పెంచాలని సీఎం చంద్రబాబు సూచన




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అత్యాధునిక టెక్నాలజీలకు కేంద్రంగా మార్చే దిశగా మరో కీలక అడుగు పడింది. అమరావతి క్వాంటం వ్యాలీ (ఏక్యూవీ)లో "క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్" ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) మధ్య ఒక ముఖ్యమైన ఒప్పందం కుదిరింది. గురువారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఏపీ క్వాంటం మిషన్, పీఎన్‌బీ ఈ అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. దేశంలో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా ఒక క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన మొట్టమొదటి బ్యాంకుగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలవడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది.ఈ ఒప్పంద కార్యక్రమంలో పీఎన్‌బీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ చంద్ర, ఏపీ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ పాల్గొన్నారు. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌లో ఏర్పాటు కానున్న ఈ హబ్, బ్యాంకింగ్ రంగంలో పెరిగిపోతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుంది. ముఖ్యంగా బ్యాంకింగ్ సేవల్లో సైబర్ భద్రతను గణనీయంగా పటిష్టం చేయడం, ఆర్థిక మోసాలను ముందుగానే పసిగట్టే వ్యవస్థలను అభివృద్ధి చేయడం, భవిష్యత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలను సురక్షితంగా తీర్చిదిద్దడం వంటి అంశాలపై ఈ కేంద్రం దృష్టి సారించనుంది. ▶2లో

## రైల్వే భూముల్లో నివసిస్తున్న వారికీ పట్టాలు

**కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాం: మంత్రి లోకేశ్**



వేదికపైకి ఎక్కలేక కిందనే ఉన్న తన వద్దకు వచ్చి పట్టా అందించిన మంత్రి లోకేశ్‌ను ఆప్యాయంగా పలుకరిస్తున్న లబ్ధిదారు షేక్ ఫాతిమాబీ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)

'ఇచ్చిన హామీని నెరవేర్చడంలో భాగంగా వివిధ శాఖలను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుం టూ.. పేదలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్నాం. రైల్వే భూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదల కూ పట్టాలు ఇస్తాం. అందుకోసం కేంద్ర ప్రభుత్వం తో సంప్రదింపులు జరుపుతున్నాం' అని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం రెండోరోజైన పండగ వాతావరణంలో కొనసాగింది. ప్రభుత్వ, నిషేధిత భూముల్లో నివాసం ఉండే 1,303 మందికి అనుభవ పత్రాలు, ఇళ్ల పట్టాలను లోకేశ్ పంపిణీ చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు కార్యక్రమం కొనసాగగా ▶2లో

## ఇష్టానుసారం 22ఏలో చేర్చడం కుదరదు




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)

నోటీసులిచ్చి, వివరణ తీసుకుని, విచారణ చేశాకే ఏ భూమిని అయినా నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చాల్సి ఉంటుందని.. అధికారులు ఇష్టానుసారం అందులో చేర్చడం కుదరదని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. ఒక అధికారి కారణంగా భూయజమాని హక్కులకు భంగం కలిగితే దానికి ఆ అధికారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22ఏ భూముల సమస్యలతో యజమానులు పడుతున్న ఇబ్బందుల్ని పరిష్కరించడానికి కొత్త మార్గదర్శకాలు జారీ చేస్తున్నామని చెప్పారు. ఇవి వెంటనే అమల్లోకి వస్తాయన్నారు. రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22ఏ కింద గతంలో జారీ చేసిన అన్ని సర్క్యులర్లు, సూచనలు, వివరణలు, మార్గదర్శకాలన్నీ దీంతో రద్దవుతాయని వెల్లడించారు. కొత్త మార్గదర్శకాలు జారీ అయినప్పటి నుంచి 90 రోజుల్లో ఐజీఆర్ఎస్, సీసీఎల్ఏ, సంబంధిత విభాగాలు సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసుకోవాలన్నారు. ఉత్తర్వులను ఉల్లంఘిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మేరకు బుధవారం జీవో విడుదల చేశారు.

## గోదావరి పుష్కరాల నిర్వహణకు రూ.50కోట్లు.. ఏపీ క్యాబినెట్ ఆమోదం




(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)

గోదావరి పుష్కరాల సమర్థ నిర్వహణకు రూ.50 కోట్లు మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఏపీ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 'నేతన్నల సేవలో' పథకం అమలుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసిందని చెప్పారు. ఈ పథకం కింద చేనేత కుటుంబాలకు ఏటా రూ.25వేల ఆర్థికసాయం అందించనున్నట్లు వివరించారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలను మీడియాకు ఆయన వెల్లడించారు."రాష్ట్రంలో మొదటి ప్రైవేటు మహిళా యూనివర్సిటీ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. భీమవరంలో విష్ణు ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ పేరిట దీన్ని ఏర్పాటు చేయనున్నారు. శ్రీకాకుళంలో బ్రహ్మకుమారీస్ సంస్థకు మున్సిపల్ స్థలం లీజు కొనసాగింపునకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అగ్నిమాపక సేవల విస్తరణ పనులకు ఆమోదముద్ర వేసింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వివిధ సంస్థలకు భూ కేటాయింపులకు మంత్రివర్గం అంగీకారం తెలిపింది" అని పార్థసారథి తెలిపారు.

## హైదరాబాద్-లండన్ విమానంలో పైలట్లకు అస్వస్థత..





(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)

హైదరాబాద్ నుంచి లండన్‌కు బయల్దేరిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో ముగ్గురు పైలట్లు అస్వస్థతకు గురయ్యారు. విమానం 30వేల అడుగుల ఎత్తులో ఉన్నప్పుడు ఒక పైలట్‌కు ఆక్సిజన్ అందించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన విమానయాన సంస్థ దర్యాప్తు ▶2లో

## వివాదాలు సృష్టించడమే గొడ్డలి పార్టీ నైజం.. అప్రమత్తంగా ఉండాలి: సీఎం చంద్రబాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 23)



గొడ్డలి పార్టీ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు సూచించారు. క్యాబినెట్ భేటీలో అజెండా అంశాలు ముగిశాక తాజా పరిస్థితులపై ఆయన మాట్లాడారు. మెగా డీఎస్సీని దిల్లీ ఆందోళనలతో ముడిపెట్టడానికి వైకాపా ప్రయత్నిస్తోందని సీఎం దృష్టికి మంత్రులు తీసుకెళ్లారు. వివాదాలు సృష్టించడమే గొడ్డలి పార్టీ నైజమని చంద్రబాబు మండిపడ్డారు. అనంతరం మరికొన్ని అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. జిల్లాల్లో ఇన్‌ఛార్జ్ మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే మెజారిటీ సమస్యలు పరిష్కారమవు తాయని చంద్రబాబు అన్నారు. మంగళగిరిలో ఇళ్ల పట్టాల పంపిణీకి మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని కొనియాడారు. ప్రతి లబ్ధిదారుడికి స్వయంగా ఇళ్ల పట్టా ఇచ్చారన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అన్ని చోట్లా సమన్వయంతో ఈ తరహా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. శాఖాపరంగా ఉన్న సమస్యల పరిష్కారానికి మంత్రులే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలపై మంత్రులు ప్రెస్‌మీట్‌లు పెట్టి చేతులు దులుపుకొన్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే విషయంలో వెనుకబడ్డారన్నారు. పలాసలో రోడ్డు ప్రమాద ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ నిందితుల్ని సీసీ టీవీ ఫుటేజ్‌ల ద్వారా పట్టించిన తీరును మంత్రులకు సీఎం వివరించారు. ▶2లో

మొదటి పేజీ తరువాయి

## అమరావతిలో పీఎన్‌బీ క్వాంటం హబ్...

కేవలం బ్యాంకింగ్ రంగానికే పరిమితం కాకుండా, పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, సమిష్టి ఆవిష్కరణలకు ఊతమివ్వనుంది. క్వాంటం కంప్యూటింగ్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి నూతన టెక్నాలజీలలో పరిశోధనలను ప్రోత్సహించడం, అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించడం కూడా ఈ హబ్ కార్యకలాపాల్లో భాగం కానుంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతిని కేవలం పరిపాలనా రాజధానిగానే కాకుండా, క్వాంటం, డీప్ టెక్నాలజీలకు ప్రపంచ స్థాయి కేంద్రంగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని పునరుద్ఘాటించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఈ హబ్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం ఆ దిశగా వేస్తున్న మరో కీలకమైన మైలురాయి అని ఆయన అభివర్ణించారు.

డిజిటల్ లావాదేవీలు విపరీతంగా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో, వినియోగదారులకు, సాధారణ ప్రజలకు డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, బ్యాంకులపై ఉందని పీఎన్‌బీ ఉన్నతాధికారులకు సూచించారు. "డిజిటల్ అరెస్ట్" వంటి ఆధునిక సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలంటే టెక్నాలజీ వినియోగాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. క్వాంటం టెక్నాలజీ ద్వారా డిజిటల్ లావాదేవీలకు అత్యుత్తమ భద్రతను అందించాలని స్పష్టం చేశారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ అశోక్ చంద్ర మాట్లాడుతూ, డిజిటల్ బ్యాంకింగ్‌ను మరింత పటిష్ఠంగా, సురక్షితంగా, సులభతరంగా మార్చేందుకే అమరావతిలో ఈ క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కేంద్రం ద్వారా బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఎన్‌బీకి చెందిన ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

## ఎప్పుడైనా మీ ఇష్టమే.. చర్చలకు ప్రభుత్వం సిద్ధం: జితేంద్ర సింగ్

సహకరించాలని కోరింది. ఎన్‌డీటీఏ ఆదేశాలను ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సాయంత్రం 6:30 గంటలకే దుకాణాలు మూసేయమనడం, జంతర్‌మంతర్ వద్ద పోలీసులను మోహరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై కేంద్రం మరోసారి బలప్రయోగం చేయాలని చూస్తోందని ఆరోపించారు.

## పేపర్‌లీక్‌పై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు.. ఆందోళనల వేళ మోదీ బిగ్ మెసేజ్

లీకేజీ బాధ్యులకు త్వరితగతిన కఠినశిక్ష పడేలా చూసేందుకు ప్రభుత్వం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు లను ఏర్పాటు చేస్తుందని ప్రకటించారు.

యువత భవిష్యత్తుకు హాని చేయాలని చూసేవారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని, వారి సంక్షేమమే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని వెల్లడించారు. "విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది కొనసాగింపు. పేపర్ లీక్ బాధ్యులకు శిక్ష పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఇందుకోసం అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటారు" అని ఎక్స్ వేదికగా మోదీ వెల్లడించారు.

**మోదీ పోస్ట్‌కు రాహుల్ రియాక్షన్..**

మోదీ ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. "మన యువత భవిష్యత్తుకు హాని చేసింది మీరే. మన విద్యావ్యవస్థ నిర్వీర్యం అవుతుంటే చూసి, బాధ్యులైన వారిని రక్షించారు. ఇప్పుడు విద్యార్థులు డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి. 1. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలి. 2. విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. 3. యువతపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని రాహుల్ ఎక్స్ రాసుకొచ్చారు.

**సీజేపీ ఏమందంటే..?**

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామంటూ ప్రధాని చేసిన ప్రకటనపై అటు సీజేపీ కూడా స్పందించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. ఇదిలా ఉండగా.. సీజేపీ ఆందోళనల దృష్ట్యా గురువారం కూడా దిల్లీలో 16 మెట్రో స్టేషన్లను అధికారులు మూసివేశారు.

## జగన్ గందరగోళం సృష్టిస్తున్నారు

అభివృద్ధిని కళ్లారా చూడాలని హితవు పలికారు. రాజధాని నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అమరావతి త్వరలోనే ఒక అంతర్జాతీయ స్థాయి ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతోందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే ఇక్కడ భారీ స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో పాటు ప్రముఖ కళాశాలలు ఏర్పాటు కాబోతున్నాయని వెల్లడించారు. అమరావతిలో భవనాల నిర్మాణాలు అద్భుతంగా సాగుతున్నాయని, భవిష్యత్తులో ఇది అత్యంత అద్భుతమైన నివాస యోగ్యమైన నగరంగా రూపుదిద్దుకుంటుందని తెలిపారు. ఐకానిక్ భవనాలకు సంబంధించిన మొదటి డైమండ్ నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి 12 ఫ్లోర్లు సిద్ధమవుతాయని ప్రకటించారు. అంతేకాకుండా ప్రాంతీయ అనుసంధానం కోసం త్వరలోనే ఇక్కడ అంతర్జాతీయ విమానాశ్రయం కూడా రాబోతుందని స్పష్టం చేశారు.

రాజధాని నిర్మాణానికి తమ విలువైన భూములను త్యాగం చేసిన రైతుల చలవ వల్లే ఈరోజు అమరావతిలో ఇంతటి భారీ నిర్మాణాలు సాధ్యమవుతున్నాయని మంత్రి కొనియాడారు. వారి త్యాగాలను కూటమి ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు.

కాగా, ఏపీ ప్రభుత్వం ప్రస్తుతం అమరావతి పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి శరవేగంగా అడుగులు వేస్తోంది. భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తూ మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేసింది. ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు అమరావతిలో తమ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకోగా, మరికొన్ని సంస్థలు తమ కార్యాలయాల నిర్మాణ పనులను కూడా ప్రారంభించాయి.

## రైల్వే భూముల్లో నివసిస్తున్న వారికీ పట్టాలు

అంతసేపూ లోకేశ్ ఓపిగ్గా నిలబడి పాల్గొన్నారు. వేదికపైకి రాలేని స్థితిలో ఉన్న వారికి.. కిందికి వెళ్లి మరీ పట్టాలను ఇచ్చారు.

**'తల్లికి వందనం' కోసం ఏటా రూ.10 వేల కోట్లు**

'పిల్లలే మన సంపద.. చదువే తరగని ఆస్తి. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నాం. అందుకోసం ప్రభుత్వం ఏటా రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. తల్లుల ఖాతాల్లో నిధుల జమ ఈరోజు మొదలైంది. 24 వరకు జమ అవుతాయి' అని లోకేశ్ చెప్పారు.

**పాఠశాల విద్యార్థులకు వీడియో పోటీ**

రాష్ట్రప్రభుత్వం 'తల్లికి వందనం' పథకాన్ని అమలుచేస్తున్న నేపథ్యంలో సమగ్ర శిక్షాభియాన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వీడియో పోటీ నిర్వహిస్తున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు తమ అమ్మపై ఉన్న ప్రేమను చాటేలా 60 సెకన్ల వీడియో రికార్డు చేసి అప్‌లోడ్ చేస్తే వాటిలో బాగున్న వీడియో చేసిన చిన్నారులకు లోకేశ్‌ను కలిసే అవకాశం లభిస్తుందని ప్రకటించారు. వీడియో రికార్డింగ్ అనంతరం తీస్త్రం.ఖజూ.స్త్రశీజ.ఱల్/బజ/చ/ష్టశీఎవ్/ష్ట్రుశ్రీశ్రీఅఎఱఖుఅఎష్ట్రుఱఖుఎ వెబ్‌సైట్‌ను తెరచి 'తల్లికి వందనం' లబ్ధిదారు వివరాలు, సెల్‌ఫోన్ నంబర్, దానికి వచ్చిన ఓటీపీని నమోదుచేయాలి. ః ఓటీపీ నమోదు చేశాకే వీడియో అప్‌లోడ్ ఆప్షన్ తెరుచుకుంటుంది. నిర్దేశించిన బాక్సులో వీడియోను అప్‌లోడ్ చేయాలి.

## వివాదాలు సృష్టించడమే గొడ్డలి పార్టీ నైజం.. అప్రమత్తంగా ఉండాలి: సీఎం చంద్రబాబు

**ఎల్‌నినోతో క్లిష్ట పరిస్థితులు రావొచ్చు..**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఈసారి క్లిష్ట పరిస్థితులు రావొచ్చని సీఎం అన్నారు. తాగునీటికి తీవ్ర సమస్య ఎదురు కావొచ్చని చెప్పారు. ఈ పరిస్థితుల్లో కృష్ణా, గుంటూరు డెల్టాలో వరిసాగు చేయకుండా రైతులను మంత్రులు చైతన్యపరచాలన్నారు. వర్షాభావ పరిస్థితులపై రైతులకు అర్థమయ్యేలా వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గోదావరి-బనకచర్ల అనుసంధానానికి కేంద్రం సహకారం ఉంటుందని వివరించారు.

**ఆగస్ట్ మొదటి వారంలో భోగాపురం.. చివరి వారంలో మదనపల్లె ఉద్యాన హబ్**

త్వరలోనే మదనపల్లెలో ఉద్యాన హబ్‌ను ప్రారంభిస్తున్నామని చంద్రబాబు ప్రకటించారు. ఆగస్ట్ మొదటి వారంలో ఉత్తరాంధ్రలో భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం.. చివరి వారంలో రాయలసీమలో ఉద్యాన హబ్ ప్రారంభం ఉంటుందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర ఆశలకు రెక్కలు కల్పించామని.. ఇక ఆ ప్రాంతంలో వెనుకబాటుతనం ఉండరాదన్నారు. రెండో త్రైమాసికంలో అడుగుపెట్టినందున శాఖల వారీగా సమీక్షలు చేసుకోవాలని మంత్రులకు సీఎం సూచించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై దృష్టిసారించాలన్నారు.

## హైదరాబాద్-లండన్ విమానంలో పైలట్లకు అస్వస్థత..

ప్రారంభించింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం..

బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం హైదరాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరింది. విమానం టేకాఫ్ అయిన కొన్ని గంటల తర్వాత ఒక పైలట్ విధులు నిర్వర్తించలేని విధంగా అస్వస్థతకు గురయ్యారు. అప్పుడు విమానం 30వేల అడుగుల ఎత్తులో ఉంది. శ్వాస తీసుకోలేకపోవడంతో ఆక్సిజన్ అందించారు. మరో ఇద్దరు పైలట్లు కూడా స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. అలాగే విధులు నిర్వర్తించిన వారు.. చివరకు లండన్‌లోని హీత్రూలో విమానాన్ని దింపారు. ఈ ఘటనపై విమానయాన సంస్థ ప్రకటన చేసింది. "మా ఉద్యోగుల సంక్షేమమే మాకు తొలిప్రాధాన్యం. అదే సమయంలో ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. పైలట్లకు ఎదురైన పరిస్థితి గురించి సమీక్షిస్తున్నాం" అని ప్రకటన విడుదల చేసింది. తర్వాత వారికి తగిన వైద్య సహాయం అందించారు. వారు ముగ్గురు హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో అల్పాహారం తిన్నట్లు తెలుస్తోంది. ఫుడ్ పాయిజినింగ్ జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు.

## రంగస్వామి ఆత్మహత్య కారకులైన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలి



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జులై 23)

రాచర్ల మండల కేంద్రానికి చెందిన యల్ల రంగస్వామి ఆత్మహత్యకు కారకులైన వారి పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్ ఓ ప్రకటనలో కోరారు. రాచర్ల గ్రామానికి చెందిన ఎల్లారంగస్వామి గురువారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోగా విషయం తెలుసుకున్న ఉదయ్ శంకర్ గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో రంగస్వామి మృత దేహాన్ని సందర్శించారు. ఆయనకు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగస్వామి ఆత్మహత్య పై వివిధ రకాల ఆరోపణలు వినిపిస్తున్నాయని, కుటుంబ సభ్యుల ఫిర్యాదును ఆధారం చేసుకుని పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి దోషుల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి ఆత్మహత్యలకు తావు లేదన్నారు. ప్రభుత్వం ఈ సంఘటన పై ప్రత్యేక విచారణ చేపట్టి దీని వెనక ఎంతటి వారున్నా వదిలి పెట్టొద్దని అన్నారు. ఆ కుటుంబానికి ఎన్డీఏ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## తంగెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు





(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, జులై 23)

మద్రిపూడి మండలంలోని తంగెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 సంవత్సరాల తర్వాత ఈ విద్యా సంవత్సరం సాధించిన ఫలితాల పై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నర్సరాజుపాలెం గ్రామంలో ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల సాధించిన విజయాలు, విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలు, ఉపాధ్యాయులు అందిస్తున్న నాణ్యమైన విద్య గురించి తల్లిదండ్రులకు వివరించారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలపై విశ్వాసం పెంచుకొని, నర్సరాజుపాలెం గ్రామం నుండి అధిక సంఖ్యలో విద్యార్థులను జెడ్‌పిహెచ్ఎస్ తంగెళ్ళ పాఠశాలలో చేర్పించారు. ప్రచార కార్యక్రమం సందర్భంగా తల్లిదండ్రులకు ఇచ్చిన హామీ మేరకు, కందుకూరు డిపో మేనేజర్, సిఐ, సిస్టమ్ మేనేజర్లతో పలుమార్లు చర్చలు జరిపిన ఫలితంగా, నేటి నుండి నర్సరాజుపాలెం గ్రామం నుండి తంగెళ్ళ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు సులభంగా చేరుకునేలా ఉదయం కందుకూరు, జువ్విగుంట బస్సు సేవను, అలాగే సాయంత్రం కందుకూరు, గుడిపాడు బస్సు సేవను నర్సరాజుపాలెం వరకు పొడిగించారు. దీనివల్ల విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు సౌకర్యవంతంగా సాగనున్నాయి. ఈ బస్సు సౌకర్యం కల్పించిన సందర్భంగా నర్సరాజుపాలెం గ్రామస్తులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కందుకూరు డిపో మేనేజర్, సిఐ, సిస్టమ్ మేనేజర్‌తో పాటు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

**గుడ్ హెల్ప్ చైర్మన్ డాక్టర్ మంద్రు ప్రవీణ్ కుమార్**

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 23)

ఈ నెల 25వ తేదీ శనివారం కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మంద్రు ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.



కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఆరోగ్య శిబిరంలో ముందస్తు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స పొందే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలతో పాటు మహిళలకు రొమ్ము (బ్రెస్ట్) క్యాన్సర్, పురుషులకు నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు పురుషులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ముందస్తు పరీక్షలు ప్రాణాలను కాపాడగలవని డాక్టర్ మంద్రు ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ ఇలాంటి ఉచిత వైద్య శిబిరాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

## మునిసిపల్ పన్నులు నూరుశాతం వసూలు చేయాలి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 23)

కనిగిరి పురపాలక సంఘము పరిధిలోని ఇంటి పన్ను, ఖాళీ స్థలం, నీటి కుళాయిల పన్నులు నూరుశాతం వసూలు చేయాలని డిఎల్‌డిఓ కె శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం పురపాలక సంఘం కార్యాలయంలో రెవెన్యూ, ఇంజనీరింగ్, సచివాలయ అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎల్.డి.ఓ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆస్థి, నీటి కుళాయి పన్నులు, యూజర్ చార్జీల వసూళ్లను సచివాలయ కార్యదర్శులు మరింత వేగవంతం చేయాలన్నారు. అధిక మొత్తంలో ఉన్న ఇంటి పన్నులు బకాయి ఉన్నవారిని గుర్తించి పన్నులు వసూలు చేయాలన్నారు. నూతనంగా నిర్మించిన గృహాలను గుర్తించి వెంటనే పన్నులు వేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ మాట్లాడుతూ కనిగిరి పట్టణంలో భూగర్భ జలాలు లేకున్నా ప్రజలకు నీటి సమస్యలు లేకుండా ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. హెచ్చు మొత్తంలో నీటి పన్ను బకాయిలు చెల్లించని గృహాలను గుర్తించి పన్నులు వసూలు చేయాలన్నారు. అధిక మొత్తంలో నీటి పన్ను బకాయిలు చెల్లించని గృహాలను గుర్తించి కనెక్షన్ తొలగించాలన్నారు. మునిసిపల్ అనుమతి లేకుండా అక్రమంగా తీసుకున్న కుళాయిలను గుర్తించి వారికి వెంటనే నోటీసులు ఇచ్చి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయాల వారీగా డిమాండ్, వసూలు వివరాలు గురించి తెలుసుకున్నారు. సచివాలయ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు అందేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. సూచించిన గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. వార్డు ప్లానింగ్ సెక్రెటరీలు డిజిటల్ డోర్ నెంబరింగ్ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. అక్రమ కట్టడములను గుర్తించి, అనుమతులు లేని వారికి నోటీసులు జారీచేసి చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా వేసిన అనధికార లే అవుట్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్ఐ వెంకటేష్, మునిసిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







ప్రకాశం



మార్కాపురం



బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

24.07.26 శుక్రవారం


# నేడు జిల్లా వ్యాప్తంగా “మెగా పేరెంట్ - టీచర్స్ మీటింగ్

## తల్లిదండ్రులందరూ భాగస్వాములై పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

## జిల్లా వ్యాప్తంగా 1,556 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహణ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ డే మీటింగ్‌ను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కార్యక్రమ వివరాలను వివరించారు. గతంలో కూడా ఈ సమావేశాలను విజయవంతంగా నిర్వహించినప్పటికీ, ఈ విద్యా సంవత్సరం విద్యా రంగంలో సరికొత్త అంశాలు, అధునాతన మార్పులు మరియు ప్రత్యేకాకర్షణలను జత చేసి మరింత ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 1,556 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు అందుబాటులో ఉండగా, వీటిలో 1,07,243 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, విశేషమేమిటంటే, ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో చేరిన మొత్తం 18,639 మంది చిన్నారులలో, 10,000 మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ బడుల్లోనే చేరడం ప్రభుత్వ పాఠశాలల పై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మెగా పేటీఎం 4.0 నిర్వహణకు ప్రభుత్వం నిధులను కూడా విడుదల చేసిందని, ప్రకాశం జిల్లాకు రూ.34,72,200 చొప్పున నిధులను ఎంఈవోల ద్వారా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో ఇప్పటికే జమ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను ప్రత్యక్ష భాగస్వాములను చేయడం, పిల్లల చదువుల పురోగతిని ఎప్పటికప్పుడు కుటుంబాలకు తెలియజేయడం, ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం చేపడుతున్న విద్యా సంస్కరణలపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. రేపు పాఠశాలలకు వచ్చే తల్లిదండ్రులకు ఘన స్వాగతం పలకడంతో పాటు ఆకట్టుకునే 'సెల్ఫీ పాయింట్లు' సాంకేతిక సందేహాల నివృత్తికై 'లీప్ దీక్షా హెల్ప్ డెస్క్' లను సిద్ధం చేశామన్నారు. తరగతి ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో వ్యక్తిగతంగా మాట్లాడి విద్యార్థుల సమగ్ర వికాసాన్ని ప్రతిబింబించే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్‌ను అందజేసి దాని పై అవగాహన కల్పిస్తారన్నారు. (తరువాయి 4లో...)

# వాటర్ గ్రిడ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశం



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 23)**

జలజీవన్ మిషన్ లో భాగంగా మార్కాపురం మండలంలోని గొట్టిపడియ వద్ద జరుగుతున్న వాటర్ గ్రిడ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. అక్కడ జరుగుతున్న పనుల తీరు, పురోగతిని బుధవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఏ ప్రాంతాలకు మంచినీటి సౌకర్యం అందబోతుంది, ప్రస్తుత పనుల తీరు వంటి విషయాలను అధికారులు మ్యాప్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. ఈ ప్రాంత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని గడువులోపు కచ్చితంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఎల్‌బిఎస్ నగర్‌లో జరుగుతున్న పైపు లైన్ పనులు సైతం కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీవి నాగేశ్వరరావు, ఈఈ సురేష్ బాబు, డీఈ శ్రీనివాసులు, ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, ఏఈలు, ఇతర ప్రాజెక్టు సంబంధించిన కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అధికార యంత్రాంగమా నీవెక్కడ ?

## బోగస్ లోన్ల ఆరోపణల పై నోరు మెదపని అధికారులు

## విజిలెన్స్ విచారణ జరిగేనా ?

## నిజాలు తెలిసేది ఎన్నడు



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 23)**

పట్టణంలోని మెప్మా కార్యాలయంలో పెద్ద ఎత్తున బోగస్ లోన్లు జరిగాయని కథనాలు వచ్చినప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై పలు దఫాలుగా వార్త కథనాలు వచ్చినప్పటికీ అధికారులు మౌన పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు ప్రజల నుండి బహిరంగంగానే వినిపిస్తున్నాయి. నిజా నిజాలు నిగ్గు తేల్చవలసిన ఉన్నతాధికారులు తప్పు చేసిన వారిని కాపాడుతున్నారనే విమర్శలు పట్టణ ప్రజల్లో గుప్పుమంటున్నాయి. మెప్మాలో ఇంత గోల జరుగుతున్న ఉన్నతాధికారులు నోరు మెదపడం లేదని రాజకీయ విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. బోగస్ లోన్లలో బ్యాంకుల ద్వారా ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందనే ఆరోపణలు వచ్చినప్పటికీ అధికారుల్లో చలనం లేదని, (తరువాయి 4లో...)

# ప్లాస్టిక్ రహిత మార్కాపురం లక్ష్యసాదనే ధ్యేయంగా ముందుకు సాగాలి

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జులై 23)**

ప్లాస్టిక్ రహిత మార్కాపురం లక్ష్యసాధన ధ్యేయంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ రహిత మార్కాపురం పై మున్సిపల్ సిబ్బంది, వ్యాపారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు (తరువాయి 4లో...)



# మార్కాపురం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి నియామకం



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జిల్లా 23)**

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రి గా రాష్ట్ర దేవాదయ, ధర్మాదయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. అదే విధంగా నూతనంగా ఏర్పడిన మరో జిల్లా పోలవరం జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా రాష్ట్ర స్త్రీ సంఘీ, సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి నియమితులయ్యారు.

# శ్రీశైలం మల్లికార్జునస్వామి సేవలో మాజీ మంత్రి శిద్ధా దంపతులు

## అమ్మవారికి రూ.27 లక్షల విలువ చేసే బంగారు గాజులు, నిత్యాన్నదాన పథకానికి రూ.3 లక్షల నగదు విరాళం అందజేత





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిని గురువారం మాజీ మంత్రి డాక్టర్ శిద్ధా రాఘవరావు, సతీమణి శిద్ధా లక్ష్మీ పద్మావతిలు దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవారి కుంకుమ పూజలు నిర్వహించారు. (తరువాయి 4లో...)

## మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులుగా సయ్యద్ ఖాదర్ బాషా నియామకం

**నియామకం పత్రం అందించిన జిల్లా అధ్యక్షులు పివి కృష్ణారావు**



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 23)**

మార్కాపురం జిల్లా బీజేపీ పార్టీ మైనారిటీ మోర్చా తొలి అధ్యక్షులుగా సయ్యద్ ఖాదర్ బాషాని నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా కండువా వేసి వారికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ మైనారిటీల అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ముస్లిం మహిళలకు ట్రిపుల్ తలాక్ చట్టం చేసి మహిళలకు మనోధైర్యం కల్పించారాని, సబ్ కా సాత్ సబ్కా వికాస్, నై రోష్ని, నై మంజిల్, గరీబ్ కళ్యాణ్ లాంటి సంక్షేమ పథకాలు అర్హులైన మైనారిటీలకు అందిస్తున్నారని, ఇంకా అనేక కార్యక్రమాలు చేస్తున్నారని, మైనారిటీలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి మైనారిటీ మోర్చాని బలోపేతం చేసి బిజెపి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండల అధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా బిఎల్ఏ 2 కోకన్వీనర్ శివప్రసాద్, మైనార్టీ మోర్చా నాయకులు పీరా, బీజేవైఎం నాయకులు కమల్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## మెగా పీటీఎం 4.0 ఆహ్వాన పత్రికల పంపిణీ

**తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలి**

**ఎంఈవో అబ్దుల్ సత్తార్**




**(షణ్ముఖ వెలుగు, కంభం, జులై 23)**

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న మెగా పీటీఎం 4.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, దాతలు, విద్యాభిమానులకు స్వయంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెగా పీటీఎం 4.0 కార్యక్రమం విద్యార్థుల విద్యా ప్రగతి, అభ్యాస నైపుణ్యాలు, హాజరు, క్రమశిక్షణ, భవిష్యత్ లక్ష్యాలపై తల్లిదండ్రులతో సమగ్రంగా చర్చించే వేదికని తెలిపారు. ప్రతి తల్లిదండ్రి తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి హాజరై తమ పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన బోధన, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం సమిష్టిగా భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కంచర్ల రామారావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని ఆహ్వాన పత్రికలను అందిస్తూ మెగా పీటీఎం 4.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పోషకాహార కిట్లు పంపిణీ




**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 23)**

చిన్నగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్నగంజాం గ్రామంలో గర్భవతులకు, బాలింతలకు ప్రధానమంత్రి పోషణ అభియాన్‌లో భాగంగా గురువారం పోషకాహార కిట్లను అవంతి ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె గిరిజ శంకర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి సాయి శ్రీ చరణ్ అందజేశారు. గ్రామంలో మొత్తం 195 కిట్లను పంపిణి చేశారు. ఈ కిట్‌ల ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలలో రక్త హీనత తగ్గుతుందని, పోషక విలువలు పెరిగి తద్వారా కాన్పులు సులభ తరం అవుతాయని తెలిపారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని మిగిలిన గ్రామాలలో త్వరలోనే ఈ కిట్‌లను అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ కె స్వర్ణలత, ఫార్మసీ ఆఫీసర్ వి రామలక్ష్మి, హెచ్‌విజే ఉల్డా రాణి, ల్యాబ్ టెక్నీషియన్ ఎన్ హరి చందన, ఎఎన్ఎమ్‌లు, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు జిల్లా వ్యాప్తంగా “మెగా పేరెంట్ - టీచర్స్ మీటింగ్

లీప్ యాప్ ద్వారా విద్యార్థి ప్రగతిని ఎలా పరిశీలించాలో వివరించడంతో పాటు, స్కూళ్లలో అమల్లో ఉన్న 75 డే యాక్షన్ ప్లాన్, డిజిటల్ ప్యానెల్స్, డిజిటల్ లైబ్రరీలు, బోధనా సామగ్రి, ప్రదర్శనలను తల్లిదండ్రులకు చూపిస్తారని ఆయన చెప్పారు. విద్యా విషయాలతో పాటు పిల్లల సురక్షిత భవిష్యత్తు కోసం జాయ్‌ఫుల్ లెర్నింగ్, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, చైల్డ్ సేఫ్టీ, స్కిల్ ఎడ్యుకేషన్, నో బ్యాగ్ డేస్, యువతను పాడుచేస్తున్న మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా “డ్రగ్స్ వద్దు బ్రో” వంటి ముఖ్యమైన అంశాల పై విస్తృత అవగాహన కల్పిస్తారన్నారు. ప్రత్యేకావసరాలు ఉన్న పిల్లల కోసం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 7 ఆటిజం సెంటర్లు, భవిత సెంటర్లు, స్క్రీనింగ్ సేవల వివరాలను కూడా వెల్లడిస్తారన్నారు. పాఠశాలల్లో పండుగ వాతావరణం నింపేందుకు తల్లిదండ్రులకు సరదా ఆటల పోటీలను నిర్వహించనున్నారని ప్రతి ఒక్క తల్లితండ్రులు పాల్గొనాలన్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు, లెమన్ అండ్ స్పూన్ ఆటలు, అలాగే పురుషులకు తాడు లాగే పోటీలు ఉంటాయన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, దాతలు కూడా ఇందులో భాగస్వాములై స్కూలు అభివృద్ధికి అవసరమైన సూచనలు అందిస్తారన్నారు. ఈ సమావేశం అనంతరం “డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం” కింద విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు అందరూ కలిసి భోజనం చేస్తారని కలెక్టర్ తెలిపారు. దీనివల్ల స్కూలు భోజనంలో వాడుతున్న పదార్థాల నాణ్యత, పరిశుభ్రతను తల్లిదండ్రులు స్వయంగా పరిశీలించే అవకాశం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ “మన బడి - మన భవిష్యత్తు - మన బాధ్యత” అనే నినాదాన్ని గుర్తుచేస్తూ, ప్రతి తల్లిదండ్రి, ఉపాధ్యాయుడు, పూర్వ విద్యార్థి, ప్రజా ప్రతినిధి రేపటి కార్యక్రమంలో తప్పకుండా పాల్గొన్నారు. ఈ మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌ను గొప్ప విజయవంతం చేయాలని, మన ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చేతులు కలపాలని జిల్లా యంత్రాంగం తరపున ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుక, సమగ్రశిక్ష జిల్లా కోఆర్డినేటర్ డి అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.



## శ్రీశైలం మల్లికార్జునస్వామి సేవలో మాజీ మంత్రి శిద్దా దంపతులు

దేవస్థానం అధికారులు, వేద పండితులు శిద్దా రాఘవరావు దంపతులకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.

**అమ్మవారికి ఆషాడ సారె సమర్పించిన శిద్దా దంపతులు**

భ్రమరాంభ సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.3 లక్షల నగదు విరాళం, అమ్మవారికి ఆషాడ సారె పురస్కరించుకుని భ్రమరాంభ అమ్మవారికి రూ.27 లక్షల విలువైన బంగారు గాజులు ఆలయ ఈఓ ఎం శ్రీనివాసరావుకు అందచేశారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దర్శనం అనంతరం దేవస్థానం ఈఓ ఎం శ్రీనివాసరావు అర్చకులతో కలసి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులకు వేద ఆశీర్వచనంతో స్వామి వారి, తీర్ధ ప్రసాదాలు, స్వామి వారి అమ్మవారి చిత్ర పటం, శేష వస్త్రాలు అందచేశారు.

## ఉలవపాడులో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పై 30న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూలై 23)**

గ్రామ పంచాయతీ కార్మికులకు మున్సిపల్ వర్కర్స్‌తో సమానంగా వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలని, కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ, పెన్షన్‌ను చెల్లించాలని, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న జీతాల బకాయిలను చెల్లించాలని, నాన సంస్కారాలకు రూ.20,000 చెల్లించాలని, తదితర డిమాండ్లతో ఈ నెల 30న ఒంగోలులోని జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రకాశం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం రమేష్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఉలవపాడు పంచాయతీ ఆఫీస్‌లోని మస్టర్ పాయింట్ వద్ద కార్మికులతో ఎం రమేష్ మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు జీవో 132, 142 జీవన అమలు చేయాలని, టెండర్ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వమే నేరుగా వేతనాలను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, జీతాలు పెండింగ్‌లో లేకుండా కమిషనర్ చెప్పినట్లుగా ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం 30వ తేదీ ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జివిబి కుమార్, పంచాయతీ కార్మికులు రావినూతల నరసింహం, వెంకట్రావు, సుబ్బలమ్మ, జయమ్మ, వరమ్మ, మల్లేశ్వరి, శారమ్మ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత మార్కాపురం లక్ష్యసాధనే ధ్యేయంగా ముందుకు సాగాలి

ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. చెత్తను రోడ్లపై వేయకుండా ఉండడంతో పాటు తడి చెత్తను పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలన్నారు. ప్రజలందరి భాగస్వామ్యంతో ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఆర్డిఓ వెంకట శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఇతర మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## అధికార యంత్రాంగమా నీవెక్కడ ?

వారు కళ్ళు మూసుకొని నిద్రపోతున్నారా అంటూ పలువురు రాజకీయ విశ్లేషకులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. మెప్మాలో బోగస్ లోన్లు జరగకపోతే ఎందుకు విచారణ చేపట్టడం లేదని సందేహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్య ప్రజలకు గ్రూపు డబ్బులు కట్టడానికి ఆలస్యమైతే నాన హంగామా చేసే అధికారులు, బ్యాంకర్లు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉంటున్నారని, పట్టణ ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అద్దంకి నియోజకవర్గ జై భీమ్‌రావు భారత పార్టీ ఇంచార్జ్ హేబెలు, కలెక్టర్ పి రాజాబాబును కలిసి బోగస్ లోన్ల విషయమై విచారణ జరపాలని కోరారు. కోర్టుకు వెళతానని కూడా కలెక్టర్‌కు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాజాబాబు విజయవాడ ఉన్నతాధికారులైన ఎండి, ఏఎండిలు స్పందించి బోగస్ లోన్ల ఆరోపణల విషయమై విచారణ జరిపి ప్రజలకు తెలియజేయాలని పట్టణవాసులు కోరుచున్నారు.

# మైదుకూరు సమీపంలో దారుణం

### మిస్సింగ్ అని వెతికేలోపే శవమై తేలిన యువకుడు
### పాడైన జగనన్న కాలనీలో బండరాళ్లతో మోది దారుణ హత్య
### ఆ ప్రేమ వ్యవహారమే ప్రాణం తీసిందా?

**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 23)**

రాత్రి వేళ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు తెల్లారేసరికి దారుణంగా హత్యకు గురైన సంఘటన మైదుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు అతడి తలపై బండరాళ్లతో మోది అత్యంత కిరాతకంగా హత్య చేశారు. ఘటన వివరాల్లోకి వెళితే మైదుకూరు నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న బోన్ చాన్ పల్లె గ్రామానికి చెందిన యన్నం వెంకటేశ్వర్లు (20) బేల్దారి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వెంకటేశ్వర్లు రాత్రి ఎంతసేపటికీ తిరిగి రాలేదు. దీంతో కంగారుపడిన తల్లిదండ్రులు, బంధువులు రాత్రంతా చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకుండా పోయింది.

**జగనన్న కాలనీలో రక్తసిక్తమైన మృతదేహం**

గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బోన్ చాన్ పల్లె సమీపంలో ఎవరూ నివాసం ఉండని (పాడుబడిన) జగనన్న కాలనీలో ఓ యువకుడి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని, హత్యకు గురైనది వెంకటేశ్వర్లుగా గుర్తించి కన్నీరుమున్నీరయ్యారు. దుండగులు అతడి తలపై బండరాళ్లతో బాదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది.

**ప్రేమ వ్యవహారమే దారితీసిందా?**

**తండ్రి సంచలన విషయాలు!**

మృతుడి తండ్రి సుబ్బారావును పోలీసులు విచారించగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. తన కుమారుడు వెంకటేశ్వర్లు గత రెండు నెలలుగా ఫోన్‌లో అమ్మాయిలతో విపరీతంగా మాట్లాడేవాడని తెలిపారు. ముఖ్యంగా మైదుకూరు సమీపంలోని నానుబాలపల్లి వద్ద గల వెంకటసుబ్బయ్య కాలనీకి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి కుమార్తెతో తరచూ మాట్లాడుతుండేవాడని, ఈ వ్యవహారమే హత్యకు కారణమై ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న మైదుకూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని ప్రేమ కోణంతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేస్తున్నామని సీఐ కె రమణారెడ్డి తెలిపారు.





## యద్దనపూడిలో నేడు మెగా పిటీఎం కుఎమ్మెల్యే ఏలూరి




**(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, జులై 23)**

స్థానిక గురుకుల పాఠశాలలో నేడు (24న) మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘తల్లికి వందనం‘ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక ర్యాలీ నిర్వహించనున్నారు. ఇందులో ఎమ్మెల్యేతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. అనంతరం జరిగే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే ఏలూరి పాల్గొని ప్రసంగించనున్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం మరింత మెరుగుపడాలని ఆయన సూచించనున్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యారంగంలో విశేష సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ఏలూరి ఘనంగా సన్మానించనున్నారు.

# రిజిస్ట్రేషన్ల ప్రైవేటీకరణ పై మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆగ్రహం

## దస్తావేజు లేఖరులకు వైఎస్సార్‌సీపీ మద్దతు







**(షణ్ముఖ వెలుగు, మైదుకూరు, జులై 23)**

రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు, స్టాంప్ డ్యూటీ వసూళ్ల వ్యవస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తోందని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మైదుకూరులో దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్ల సంక్షేమ సంఘం చేపట్టిన నిరసన ధర్నాకు ఆయన పూర్తి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులు, జీవో నెంబర్ 396 వల్ల కలిగే నష్టాలపై ఆయన విస్తృతంగా ప్రసంగించారు.

**సబ్-రిజిస్ట్రార్ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర**

ఏళ్ల తరబడి ప్రభుత్వ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను, కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం తహతహలాడుతోందని విమర్శించారు.

**ప్రజా ఆస్తుల డేటా భద్రత ప్రశ్నార్థకం**

రాష్ట్ర ప్రజలకు చెందిన ఇళ్లు, స్థలాలు, వ్యవసాయ భూములకు సంబంధించిన అత్యంత సున్నితమైన ఆస్తుల సమాచారాన్ని ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉంచడం అంటే, వారి భద్రతను అక్రమార్కుల చేతుల్లో పెట్టడమేనని హెచ్చరించారు.

**ప్రభుత్వ రాబడికి గండి - కార్పొరేట్లకు లబ్ధి**

ప్రభుత్వ ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న స్టాంప్ డ్యూటీ వసూళ్లను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ద్వారా ప్రభుత్వ రాబడికి తీవ్ర గండిపడే ప్రమాదం ఉందన్నారు. ప్రజల సొమ్మును ప్రైవేట్ వ్యాపారుల చేతుల్లో పెట్టడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆరోపించారు.

**లక్షలాది కుటుంబాల జీవనోపాధి పై దెబ్బ**

స్టాంప్ వెండర్లు, దస్తావేజు లేఖర్లు తరతరాలుగా ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని, జీవో 396 వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాదిమంది లేఖర్లు, వారిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**జీవో 396 రద్దు వరకు విశ్రమించం**

ఉద్యోగుల, కార్మికుల పొట్ట కొట్టే జీవో నెంబర్ 396 ను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల తరపున వైఎస్ఆర్‌సీపీ రాజీలేని పోరాటం చేస్తుందని, జీవో రద్దు అయ్యే వరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజా ఆస్తుల భద్రతను పణంగా పెడుతూ, దస్తావేజు లేఖర్ల పొట్టకొట్టేలా చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసిన జీవో 396 ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో వైఎస్ఆర్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని శెట్టిపల్లి రఘురామిరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డెం వెంకట సుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు కేపీ లింగన్న, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మహబూబ్ షరీఫ్, రిజిస్టర్ ఆఫీస్ పరిధిలోని స్టాంపు వెండర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే ఏలూరి

**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 23)**





ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్‌కార్డులు, భూ సమస్యలు తదితర అంశాల పై పలువురు వినతిపత్రాలు అందజేశారు.

**ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే ఏలూరి..**

పతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. వెంటనే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. మరికొన్ని సమస్యలపై అధికారులకు లేఖలు రాసి, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, ప్రతి ఫిర్యాదుపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటానని అన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తామని, ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

# ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి భేటీ

## కడప జిల్లా రైల్వే ప్రగతికి వినతుల వెల్లువ

## అమృత్ భారత్ పథకంలో యర్రగుంట్ల స్టేషన్ చేర్చాలని విజ్ఞప్తి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, జులై 23)**

వైఎస్సార్ జిల్లాలో రైల్వే మౌలిక సదుపాయాల కల్పన, ప్రయాణికుల రవాణా సౌకర్యాల మెరుగుదలే లక్ష్యంగా కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని వివిధ రైల్వే సమస్యలపై, అభివృద్ధి పనులపై ప్రత్యేక లేఖల ద్వారా కేంద్ర మంత్రికి వినతిపత్రాలు సమర్పించారు. మంత్రితో జరిగిన ఈ భేటీలో ఎంపీ అవినాష్‌రెడ్డి పలు కీలక ప్రతిపాదనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**యర్రగుంట్ల స్టేషన్‌కు మహర్దశ**

రాయలసీమలోనే కీలకమైన పారిశ్రామిక, రవాణా జంక్షన్‌గా ఉన్న యర్రగుంట్ల రైల్వే స్టేషన్‌ను "అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్" కింద ఎంపిక చేసి, అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించాలని కోరారు. కడపలో రెండు షిఫ్టుల్లో రిజర్వేషన్ కౌంటర్లు: జిల్లా కేంద్రమైన కడప రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న దృష్ట్యా, టికెట్ బుకింగ్ ప్రయాసలను నివారించేందుకు రెండు షిఫ్టులలో రిజర్వేషన్ కౌంటర్లను నిరంతరం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

**ముఖ్యమైన రైళ్లకు స్టాపేజీలు :** జిల్లాలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని కీలకమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలుపుదల పునరుద్ధరించాలని లేదా క్రొత్తగా కల్పించాలని కోరారు.

**కేంద్ర మంత్రి సానుకూల స్పందన :** ఎంపీ అవినాష్‌రెడ్డి సమర్పించిన వినతుల పై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. కడప జిల్లా రైల్వే అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని, పనుల పురోగతి పై త్వరలోనే తగిన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా ప్రజల సౌకర్యార్థం, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఎంపీ అవినాష్‌రెడ్డి కడప జిల్లా అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నారని పార్టీ శ్రేణులు ఈ సందర్భంగా కొనియాడాయి.

# భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంపును ప్రారంభించిన డిప్యూటీ డిఇఓ సంజీవ్



**(షణ్ముఖ వెలుగు, పీసీపల్లి, జులై 23)**

భవిత కేంద్రంలోని పిల్లలకు ఫిజియోథెరపీ ఎంతగానో ఉపయోగపడుతుందని కనిగిరి డివిజన్ డిప్యూటీ డిఇఓ అన్నారు,గురువారం నాడు మండల కేంద్రమైన పీసీ పల్లి భవిత కేంద్రంలో జరిగిన ఫిజియోథెరపీ క్యాంపు కార్యక్రమాన్ని కనిగిరి డివిజన్ డిప్యూటీ డిఇఓ సంజీవ్, ఎంఈఓ ఆర్ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఫిజియోథెరపీ వల్ల ఉపయోగాలు భవిత కేంద్రం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అనేక పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూఎస్ఎన్ పిల్లల తల్లిదండ్రులకు సూచనలు చేశారు. అనంతరం ఎంఈఓ 1, ఎంఈఓ 2 లు భవిత కేంద్రంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పిలు పి నాగేశ్వరరావు, జి శ్వేషిక, ఫిజియోథెరపీ డాక్టర్ జి పుల్లయ్య, సిడబ్ల్యూఎస్ఎన్ పిల్లలు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యకర్తలతో సమావేశమైన కందుల విగ్నేష్‌రెడ్డి








**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 23)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు, యువనేత కందుల విగ్నేష్‌రెడ్డి మార్కాపురం మండలంలోని ఇడుపూరు గ్రామంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం అయ్యారు. అనంతరం బోడపాడు గ్రామంనకు చెందిన ముక్కామళ్ల శ్రీనివాసరెడ్డి అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న కందుల విగ్నేష్‌రెడ్డి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మహిళలకు శుభవార్త

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 23)**



ప్రతి నెల జరిగే నాలుగవ శుక్రవారం ఉచిత క్యాంపులో భాగంగా శ్రావణి హాస్పిటల్ నందు గర్భిణీ స్త్రీలకు, మహిళలకు ఉచిత మెడికల్ క్యాంపు కలదు. ఈ ఉచిత క్యాంపు నందు ఉచిత ఓపితో పాటు స్కానింగ్ ఉచితంగా చేయబడును. అదే విధంగా ఫ్రీ క్యాంపులో బుక్ చేసుకున్న గర్భిణీ స్త్రీలకు ఆపరేషన్, నార్మల్ డెలివరీకి అయ్యే ఖర్చులో 30% తగ్గించబడుతుందన్నారు. కావున మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రావణి హాస్పిటల్ అధినేత డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 08596-222550 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## ఘనంగా భారత చైతన్య యువజన పార్టీ 3వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)

భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ మూడవ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు నగరంలోని ప్రకాశం భవన్ ప్రక్క బజారులో జిల్లా కన్వీనర్ చల్లా హరి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలో మొట్టమొదటి బీసీవై పార్టీ జెండా దిమ్మెను ప్రారంభించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచుతూ పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి ఉత్సాహంగా ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధి, బీసీల హక్కుల పరిరక్షణ కోసం మరింత కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ రాష్ట్ర నాయకులు లాయర్ నర్రావుల శ్రీనివాసులు, రాష్ట్ర బీసీ నాయకులు మిరియం శ్రీనివాసులు, నియోజకవర్గ నాయకులు బలరాం, వినోద్, కృష్ణబాబు, రాజబాబు, అప్పారావు, రాజ్యలక్ష్మి, సినీ దర్శకుడు సల్లా ఈశ్వర్, గొర్ల గోపి, సీహెచ్ శోభన్ బాబు, ఎరగాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## నేటి విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి





(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జులై 23)

విద్యార్థుల భవిష్యత్తు కోసం, న్యాయమైన విద్యా వ్యవస్థ కోసం 24న విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యా సంస్థల బంద్ ను విజయవంతం చేయ్యలని జిల్లా ఎస్ఎఫ్ఐ నాయకులు కె తేజ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిన్నగంజాం మండలంలోని చిన్నగంజాం జేడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె శ్రీనివాసరెడ్డికి నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు కె తేజ మాట్లాడుతూ సంవత్సరాల పాటు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత బాధ్యతారాహిత్య చర్య అని, పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాల్సిన జాతీయ స్థాయి పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడం వల్ల విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసం దెబ్బతిందన్నారు. డిల్లీలో పార్లమెంట్ మర్చికి వచ్చిన విద్యార్థులపై లాటీచార్జి చేయ్యటం హేమమైన చర్య అని నిట్ వైఫల్యానికి నైతిక బాధ్యత వహిస్తూ సంబంధిత కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయ్యలని డిమాండ్ చేసారు. అలా విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలనే లక్ష్యంతో ఈ నెల 24వ తేదీన ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నామని బంద్‌లో ప్రతి విద్యార్థి చైతన్యంతో పాల్గొని, ప్రశాంతంగా, క్రమశిక్షణతో బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వై దినకర్, ఎమ్ బ్లేస్సి, వై చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# నీట్ విద్యార్థుల పై పోలీసుల దాడి అమానుషం రావినూతల కోటి మాదిగ







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)

బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ఎంఆర్పీఎస్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఒంగోలు కలెక్టరేట్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ నిరసన చేపట్టడం జరిగింది. నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టిన కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని, అలాగే తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులు, ప్రతిపక్ష నాయకులపై ఢిల్లీలో జరిగిన పోలీసుల బలప్రయోగాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఎంఆర్పీఎస్ అధినేత ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పిలుపు మేరకు ప్రకాశం జిల్లా అధ్యక్షులు రావినూతల కోటి మాదిగ ఆధ్వర్యలో ఒంగోలు కలెక్టరేట్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రావినూతల కోటి మాదిగ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎన్నో సంవత్సరాల కష్టంతో సిద్ధమయ్యే నీట్ పరీక్షల విశ్వసనీయత దెబ్బతినడం అత్యంత ఆందోళనకరమని అన్నారు. పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకల పై పారదర్శకంగా, వేగంగా విచారణ జరిపి బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ప్రజా ప్రతినిధుల పై పోలీసులు బలప్రయోగం చేయడం, టియర్ గ్యాస్ విడుదల చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించే చర్యని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పించిందని, ఆ హక్కును అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించడం పై దృష్టి పెట్టకుండా, ప్రశ్నించే గొంతులను అణచివేసే ధోరణిని అవలంబిస్తోందని విమర్శించారు. నీట్ వ్యవహారం పై కేంద్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర వివరణ ఇవ్వాలని, పరీక్షా వ్యవస్థ పై విద్యార్థుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, వారి భవిష్యత్తుతో ఎవరూ చెలగాటం ఆడకూడదని పేర్కొంటూ, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు ఎంఆర్పీఎస్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొమ్మూరి గరటయ్య మాదిగ, రేణమాల మాధవ్ మాదిగ, గంధం ఇర్మియా మాదిగ, ప్రత్తిపాటి నాగయ్య మాదిగ, గౌడపేరు మహేష్ మాదిగ, బక్కా రాజు మాదిగ , మల్లెల ప్రసాద్ మాదిగ, సూరపోగు మోజేష్ మాదిగ, రావినూతల కొర్నేలు మాదిగ, బెన్నీ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# పండ్ల తోటల సాగు పట్ల ఆసక్తి కలిగిన రైతులను గుర్తించాలి

## మార్కాపురం జిల్లా విబిజీరామ్‌జీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ సువార్త









(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 23)

కనిగిరి డివిజన్ పరిధిలో పండ్ల తోటల సాగు పట్ల ఆసక్తి గల రైతులను గుర్తించి వారికి అంచనాలను తయారు చేసి సాగుకు సమాయత్తం చేయాలని మార్కాపురం జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సి హెచ్ సువార్త అన్నారు. గురువారం కనిగిరి క్లస్టర్ కార్యాలయంలో ఆరు మండలాల ఏపీఓ, ఈసి, సాంకేతిక సహాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీబీజీ రామ్‌జీ పథకం ద్వారా ఎవరైనా ఆసక్తి కలిగిన రైతులకు మూడు సంవత్సరాల పాటు ఉచితంగా నిర్వహణ ఖర్చులు పథకం ద్వారా చెల్లించడం జరుగుతుందన్నారు. చిన్న, సన్న కారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ పథకం ద్వారా మామిడి, సపోటా, నిమ్మ, బత్తాయి, జామ, దానిమ్మ, సీతాఫలం, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్ వంటి తదితర పండ్ల జాతి మొక్కల తో పాటు పూల మొక్కలు కూడా సాగు చేసుకోవచ్చున్నారు. ఈ నెల 25 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధుల ద్వారా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. అందులో భాగంగా మార్కాపురం జిల్లాకు 5000 ఎకరాలు టార్గెట్‌గా ఇవ్వడం జరిగిందన్నారు. సిబ్బంది అందరు త్వరితగతిన రైతులను గుర్తించి అంచనాలు తయారు చేసి మంజూరు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ప్రతి మండలం, ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కూలీలకు కల్పించాలని తెలిపారు. ప్రతి మండలానికి ఫారం పాండ్స్, ట్రెంచ్‌లు, సశీకెన్ పిట్లు, మ్యాజిక్ డ్రెయిన్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు రాంబాబు, నిర్మలాదేవి, ఆరు మండలాల ఏపీఓ, ఈసి, టీఏ లు పాల్గొన్నారు.


# మాజీ మంత్రి జీవి శేషుకి నివాళులర్పించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన మహోన్నత వ్యక్తి గుర్రాల వెంకట శేషు అని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అన్నారు. జీవి శేషు 10వ వర్ధంతి సందర్భంగా కొత్త కూరగాయల మార్కెట్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎమ్మెల్సీగా పనిచేసి ప్రజలకు సేవ చేసిన వ్యక్తి జీవి శేషు అని అన్నారు. వారి కుటుంబ సభ్యులు కోరిన వెంటనే విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు కూడా ఇవ్వటం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నతంగా సేవలందించిన వ్యక్తి శేషు అని, అందుకోసమే ఆయనని గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆయనకు ఘన నివాళి అర్పిస్తున్నట్లు తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉడా చైర్మన్ షేక్ రియాజ్, సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు, మాజీ మేయర్ గంగాడ సుజాత, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగరాజు రాంబాబు, కామేపల్లి శ్రీనివాసరావు, ఎద్దు శశికాంత్ భూషణ్, ఆయన కుమారుడు గుర్రాల రాజ్ విమల్, జీవి శేషు మనవళ్లు, నగర పార్టీ అధ్యక్షులు బండారు మదన్, కొఠారి నాగేశ్వరరావు, గుంటూరు రాంబాబు, వైవి సుబ్బారావు, పాతూరి పుల్లయ్య, ఘన శ్యామ్, మాలెంపాటి కృష్ణారావు,టి.వి శ్రీరామ్మూర్తి, మాజీ కార్పొరేటర్లు అబ్బూరి శ్రీను, పసుపులేటి శ్రీనివాస్, చింతపల్లి గోపి, వేమూరి మాల్యాద్రి, నాయకులు బోడపాటి వెంకట్, నాలం నరసమ్మ, కూరపాటి కాశిరావు, ఉండవల్లి రాము, ఉప్పుటూరి రవిచంద్ర, పసుమర్తి హగ్గయ్య రాజు, జీవి శేషు అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఢిల్లీలో విద్యార్థుల పై మోడీ పోలీస్ దమనకాండ ఎమర్జెన్సీ, జలియన్ వాలాబాగ్‌ను మరిపించింది

**ప్రశ్నించే గొంతుకుల పై ప్రధాని మోడీ ఫాసిస్ట్ విధానాలను వ్యతిరేకిద్దాం**
**నీట్ పరీక్ష లీకేజీకి కారకుడైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మోడీ తొలగించాలి**
**నీట్ పరీక్షను కేంద్రం నుండి తప్పించి రాష్ట్రాలు నిర్వహించుకునేలాగా చట్టం తేవాలి**
**దళిత నేత నీలం డిమాండ్**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

ఢిల్లీలో విద్యార్థులపై మోడీ సనాతన ఫాసిస్ట్ పోలీస్ విధ్వంసకాండ 1977 నాటి ఎమర్జెన్సీ, బ్రిటిష్ జలియన్ వాలాబాగ్ లను మించిపోయిన ఆర్ఎస్ఎస్ ప్రేరేపిత ఆటవిక బిజెపి పాలన హింసకు పరాకాష్ట అని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు మనువాద బిజెపి పోలీసు హింసకాండపై మండిపడ్డారు. గురువారం ఒంగోలు నీలంపాలెంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఢిల్లీ విద్యార్థుల పై జరిగిన పోలీస్ హింసకు బొద్దింకల పార్టీకి 24 రోజుల నుండి నిరాహార దీక్ష చేస్తున్న వాంగ్ చుక్ కు మద్దతుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ వైద్య, విద్యార్థులు సంవత్సరాలపాటు కోచింగ్ తీసుకుని లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నీట్ పరీక్షలు రాస్తే బిజెపి ప్రభుత్వం నియమించిన నీట్ పరీక్షల నిర్వహణ కమిటీ వారే నీట్ పేపర్ లీకేజీ చేసి వైద్య విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేశారన్నారు. కొంతమంది వైద్య విద్యార్థులు మనోవేదనతో చనిపోయారు అన్నారు. మోడీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో 152 సార్లు పరీక్షల పేపర్లు లీక్ చేసి ప్రభుత్వ పెద్దలు అమ్ముకున్నారన్నారు. నీట్ పరీక్షలు కేంద్ర ప్రభుత్వం పరిధి నుండి తప్పించి రాష్ట్రాలు పరిధిలో స్వతంత్రంగా నీటి పరీక్షలు నిర్వహించుకునేలాగా కేంద్ర ప్రభుత్వం చట్టం మార్చాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ లాంటి వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నిరుద్యోగ యువత గురించి బొద్దింకల్లాగా మారారని అవమానిస్తూ మాట్లాడిన మాటల ప్రేరణతో అమెరికాలో నివసించే అభిజిత్ దీప్ కే అనే దళిత యువకుడు కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటు చేశారన్నారు. నీట్ లీకేజీ కుంభకోణానికి కారకుడైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ తో పాటు సామాజిక ఉద్యమకారుడు వాంగ్



చుక్ కూడా ఆమరణ నిరాహార దీక్ష చేపడితే బిజెపి ప్రభుత్వం అరెస్టు చేసి వాంగ్ చిక్ ను హాస్పటల్లో పెట్టిందన్నారు ఈ అమానుష రాజ్యాంగ వ్యతిరేక ఘటనపై విద్యార్థులు ఆగ్రహించి మేధావులు తోడు రాగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమానికి దిగారు అన్నారు. విద్యార్థులు యువతులు పిల్లలు అనే తేడా చూడకుండా మోడీ ప్రభుత్వం తన పోలీస్ బలగాల చే ఆర్ఎస్ఎస్ గూండాలచే ఆటవిక దాడి చేయించిందన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయకుండా నీట్ పరీక్షల నిర్వహణపై సమాధానం చెప్పకుండా మోడీ ప్రభుత్వం దాటవేసిందన్నారు. ప్రశ్నించే గొంతుకులపై ఫాసిస్ట్ పోలీస్ జరపటం ఉప చట్టాలతో అర్బన్ నక్సలైట్లు అంటూ మేధావులను భయభ్రాంతులకు గురి చేయటం బిజెపి ఎజెండాగా మారిందన్నారు. 1977 నాటి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ మించి బ్రిటిష్ ప్రభుత్వం జలియన్వాలాబాగ్ లో భారతీయుల పై జరిపిన పోలీస్ దమనకాండను మించిపోయేలా విశ్వ గురువు హిందూ ధర్మ పరిరక్షకుడు మోడీ విద్యార్థి లోకం పై జరిపించిన ఆటవిక పోలీస్ దమనకాండ భారత దేశ చరిత్రకు ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చ అన్నారు. బిజెపి మోడీ మత విద్వేష నియంత పాలనకు గొడుగు పడుతున్న జైలు పార్టీలు గానీ ప్రశ్నించడానికి పార్టీ పెట్టాను అన్న సనాతన స్టార్ట్ పవన్ కళ్యాణ్ గాని ఢిల్లీలో విద్యార్థి లోకం పై ప్రభుత్వ పోలీస్ ఆర్ఎస్ఎస్ గూండాలు జరిపిన దాడిపై నోరు మెదపక చెవులో కమలం పువ్వులు పెట్టుకున్నారన్నారు. ఢిల్లీ విద్యార్థి లోకం పై ఆర్ఎస్ఎస్ ప్రేరేపిత బిజెపి ప్రభుత్వ పోలీసులు బజరంగ్ గుండాలు జరిపిన ఆటవిక దాడితో బిజెపి పాలనకు కౌంట్డౌన్ మొదలైంది అన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి నీట్ లీకేజీ కుంభకోణానికి కారకుడైన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను మోడీ ప్రభుత్వం వెంటనే తొలగించాలన్నారు అలాగే వైద్య విద్యార్థుల నీట్ పరీక్ష కేంద్ర ప్రభుత్వం నుండి తప్పించి ఆయా రాష్ట్రాలు ఎవరికి వారు స్వతంత్రంగా నిర్వహించుకునేలా కేంద్ర ప్రభుత్వం మార్పు చేయాలని నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య మాదిగ పరిరక్షణ సమితి అధ్యక్షులు పట్టరా బంగారం, దేవరపల్లి గోపి, గడ్డం వెంకటేశ్వర్లు, మహిళలు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులు పరిష్కారం పై దృష్టి సారించాలి

**ప్రజాదర్బార్‌లో ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు ఆదేశం**





**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 23)**

ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా వెంటనే పరిష్కరించాలని, ప్రజా దర్బార్ వేదికగా ప్రజలు సమర్పించిన ప్రతి ఒక్క అర్జీని పూర్తి చేసి ఆ విషయాన్ని వారికి తెలియజేయాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ వర్గాల ప్రజల నుండి గ్రామాల్లో పింఛన్లు, సైడ్ డ్రైన్లు, సిసి రోడ్లు, భూసమస్యలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి మొత్తం 22 అర్జీలు వచ్చాయి. ప్రతి ఒక్కరి సమస్యను పరిశీలించిన జీవి ఆంజనేయులు, ప్రజా దర్బార్ వేదిక నుండే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సుపరిపాలన, సమన్యాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా తీసుకెళ్తూ ప్రజా ప్రభుత్వంగా మన్ననలు పొందుతున్నామని ఆయన వివరించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా పారదర్శక సేవలు అందించడమే ధ్యేయమని, ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పెద్ద సంఖ్యలో సేవలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలు ఇంటి వద్ద నుంచే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆలోచనల ప్రకారం సేవలలో నాణ్యత, సమయపాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ, నిత్యం వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించినప్పుడే పాలనా యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని జీవి ఆంజనేయులు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 396ను వెంటనే రద్దు చేయాలి

**సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు డిమాండ్**



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 23)**

గురువారం స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పెన్డౌన్ కార్యక్రమం చేపట్టిన దస్తావేజు లేఖర్లు శిబిరంలో కందుకూరు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వారు ఇటీవల జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 396 ప్రవేశ పెట్టడం ద్వారా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పిపిపి విధానం ద్వారా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, దీనిని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రైవేట్ సంస్థలకు రిజిస్ట్రేషన్ ఆఫీసులో ఇవ్వడం వలన అనేక భూములు ఒకరికి తెలియకుండా ఒకరి మీద ఆన్లైన్ చేసే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. ఈ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు గా పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలకు పి పి పి విధానం ద్వారా అప్పగించడం వలన రిజిస్ట్రేషన్ కార్యాలయం నమ్ముకొని గత కొంతకాలంగా పనిచేస్తున్న దస్తావేజర్లు, స్టాంపు వండర్లు, డిటిపి చేసే వర్కర్లు, ఇంకా అనేక మంది రిజిస్ట్రేషన్ కార్యాలయం నమ్ముకొని జీవిస్తున్న కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే రిజిస్టర్ కార్యాలయాలు ప్రైవేట్ పరం చేసే విధానాన్ని విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై ఆనంద్‌మోహన్, సిహెచ్ దుర్గాప్రసాద్, చిన్న బ్రహ్మయ్య, దస్తావేజులేఖర్లు పాల్గొన్నారు.

## కార్డెన్ సెర్చ్ నిర్వహించిన కందుకూరు పోలీసులు

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 23)**

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కందుకూరు పట్టణంలోని డిఎస్పి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో సబ్ డివిజనల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సిఐలు, సిబ్బందితో కలిసి పట్నంలోని కల్లూరి ప్రశాంతి కాలనీ నందు గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అందులో భాగంగా 150 ఇళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ అన్వర్ భాష మాట్లాడుతూ సరైన పత్రాలు లేని 37 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అనుమానస్పద వ్యక్తులు నేరస్తులు ఆశ్రయం ఇవ్వకుండా చూడ్డం, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు విక్రయించకుండా అరికట్టాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ బండ్ల భార్గవ్, రూరల్ ఎస్ఐ బాలకృష్ణ, గుడ్లూరు సిఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.








## స్వర్ణలో ‘శక్తి టీం’ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



**(షణ్ముఖ వెలుగు, కారంచేడు, జులై 23)**

కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ఎస్.ఐ ఖాదర్ బాషాల ఆధ్వర్యంలో చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం గురువారం కారంచేడు మండలం, స్వర్ణ గ్రామంలోని జిల్ల ‘శక్తి యాప్’ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కారంచేడు ఎస్ఐ ఖాదర్ భాషా మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలు వివరించారు మహిళల పై వేధింపులు జరగకుండా శక్తి యాప్ ముస్తఫా ఫోన్ నెంబర్ 112కి కాల్ చేయాలని తెలిపారు. బస్టాప్‌లు, హైస్కూల్ పరిసరాలు, ప్రజా ప్రదేశాలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ఈవ్‌టీజింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, వెంటపడటం, బెదిరింపులు వంటి వేధింపులను సహించకూడదని విద్యార్థినులకు సూచించారు. ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు వెంటనే ‘శక్తి యాప్’ (రూరా) ద్వారా లేదా 112 నెంబరుకు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ మహిళల గౌరవాన్ని కాపాడే బాధ్యతను గుర్తించాలన్నారు. వేధింపులు లేని విద్యా వాతావరణాన్ని నిర్మించేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, విద్యార్థినులు చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయపాలన, త్మరక్షణ నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, చట్టాలపై అవగాహన పెంచుకుని తమ హక్కులను తెలుసుకోవడం ఎంతో అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో కారంచేడు ఏఎస్ఐ ఏ శివారెడ్డి, శక్తి టీం కానిస్టేబుల్ కె సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ కోటి స్వామి, శక్తి బృందం, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆయుష్ శాఖతో కలిసి డీఎల్ఎస్ఏ ఉచిత వైద్య శిబిరం




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ), ఒంగోలు ఆధ్వర్యంలో ఆయుష్ శాఖ సహకారంతో గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవలతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడే కార్యక్రమాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిరంతరం నిర్వహిస్తోందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భ్రమరాంబ ఆయుష్ వైద్య విధానాల ప్రాధాన్యాన్ని వివరించి, హాజరైన న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్ రమేష్ బాబు, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో పలువురు వైద్య సేవలను వినియోగించుకున్నారు.

## కారుమంచి పెనుగొండయ్య మృతికి నివాళి


**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 23)**



మండలంలోని కరేడు పంచాయతీ టెంకాయచెట్లపాలెం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కారుమంచి పెనుగొండయ్య గురువారం స్వర్గస్తులయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షులు నేలటూరి ఆదాం ఆయనకు ఘనంగా నివాళు లర్పించి వారి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

# మైనర్ బాలికను శుక్రవారం హాజరు పరుస్తాం

**హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తికి తెలిపిన ప్రభుత్వ న్యాయవాది**



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

55 రోజుల క్రితం కిడ్నాప్‌కు గురైన మైనర్ బాలిక ను శుక్రవారం హైకోర్టులో హాజరు పరుస్తామని గురువారం విచారణకు వచ్చిన హెబియస్ కార్పస్ పిటిషన్ విచారణ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది హైకోర్టు న్యాయమూర్తులకు తెలిపారు. రోదియా తన కుమార్తె గురైందని కీర్తిపాటి వెంకట్రావు నమ్మించి కిడ్నాప్ చేసి తీసుకుని వెళ్లాడని జూన్ మూడవ తేదీన ఉలవపాడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన విషయం విధితమే అన్నారు. కానీ ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు ఇంటర్ చదివిన రోదియా కుమార్తె ను కిడ్నాప్ చేసిన కీర్తిపాటి వెంకట్రావు పై ఫోక్సో, కిడ్నాప్ కేసు కట్టకుండా మొక్కుబడిగా బాలిక మిస్సింగ్ క్రైమ్ నెంబర్ 60/26గా కేసు నమోదు చేశారన్నారు. తమ మైనర్ కుమార్తె ఆచూకీ చెప్పాలని పోలీస్ స్టేషన్కు వెళ్లిన మైనర్ బాలిక తల్లిదండ్రులను బంధువులను ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు అవమానించి బాధించారన్నారు. బాలిక ఆచూకీ కోసం వెతకకుండా కిడ్నాపర్కు మద్దతుగా మాట్లాడుతూ బాలిక తల్లిదండ్రులను మనోవేదనకు గురి చేశాడు అన్నారు. బాలిక కిడ్నాప్ ఉలవపాడు ఎస్ఐ సుబ్బారావు అవహేళనతో విసిగిపోయిన బాలిక బంధువులు కందుకూరు సిఐ కందుకూరు డిఎస్పిలోని ఆశ్రయించిన ఉలవపాడు సుబ్బారావు ఖాకీ కథలకు వంత పాడారన్నారు. తరువాత జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలసి ఫిర్యాదు చేసినా సరిగా స్పందించలేదన్నారు. బాధిత తల్లిదండ్రులు దళిత నాయకులు నీలం నాగేందర్‌ని కలిశారు. సోమవారం కలెక్టరేట్లో జరిగిన ఎస్సీ, ఎస్టీ స్పెషల్ గ్రీవెన్స్ సెల్ లో జిల్లా కలెక్టర్ రాజాబాబు కు ఫిర్యాదు చేస్తే కందుకూరు డిఎస్పీ బాలసుబ్రమణ్యంతో ఫోన్లో మాట్లాడి బాలిక ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పోగించాలని, కిడ్నాపర్‌ను అరెస్టు చేయాలని ఫోక్సో, కిడ్నాప్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. కానీ బేతాళుడి కథలాగే కందుకూరు డిఎస్పి కూడా కలెక్టర్‌కు ఖాకి కథ, బాలిక బంధువులతో కలిసి ఉలవపాడు ఎస్ఐ పోలీస్ టీములు పనిచేస్తున్నాయని తెలిపారు. అంతట పోలీస్ అధికారులు మొత్తం మాదిగ బాలిక కిడ్నాపర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ పోక్సో కేసు, కిడ్నాప్ కేసు కట్టకుండా కాలయాపన చేస్తున్నారని గ్రహించానన్నారు. వెంటనే జగన్‌ను కోడి కత్తితో పొడిచిన కోడి కత్తి శ్రీను కేసును హైకోర్టులో వాదించిన ప్రముఖ న్యాయవాది సలీంతో ఫోన్లో మాట్లాడి రోజు బాధిత బాలిక తల్లి రోదియా సంతకాన్ని కేసుకు అవసరమైన ఎఫ్ఐఆర్, క్యాస్ట్ సర్టిఫికేట్, స్టడీ సర్టిఫికేట్ పంపించి హైకోర్టులో ఈ నెల 21వ తేదీన హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయించారన్నారు. గురువారం ఏపీఎస్ కార్పస్ పిటిషన్ విచారణకు రాగా పోలీస్ తరఫున హాజరైన హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదులు బాలికను శుక్రవారం రోజు హైకోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. బాలిక ఒక రూములో ఉన్నదని, కిడ్నాపర్ ముఖానికి గుడ్డ కట్టుకొని అదే రూములో ఉన్నట్లు వీడియో హైకోర్టుకు చూపించారన్నారు. ప్రభుత్వ పోలీస్ తరఫున వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తులు రోదియా కూతురు కిడ్నాప్ కేసును శుక్రవారంకు వాయిదా వేశారని దళిత కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# మాజీ మంత్రి అప్పలరాజు అక్రమ అరెస్టును ఖండించిన ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ చైర్మన్ సైకం రాజశేఖర్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

మత్స్యకార నేత, మాజీ రాష్ట్రమంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు వారి కుటుంబ సభ్యుల పై కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని ఏపీ ఫిషర్‌మెన్ జేఏసీ చైర్మన్ రాజశేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పలరాజు అరెస్టును నిరసిస్తూ ఒంగోలులోని ఎంసీపీఏ భవన్లో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన రోడ్డు యాక్సిడెంట్ లో గొర్రెల కాపరి దానయ్య మృతి పట్ల ఏపీ ఫిషర్ మెన్ జెఏసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైందని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. 2026 జులై 11వ తేదీన పలాస కాశీబుగ్గ పాత హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దామయ్య అనే గొర్రెల కాపరి ఘటన స్థలంలో మృతి చెందినట్లు తెలుస్తుందన్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టి సిద్ధార్థ అనే వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, తదానంతరం నష్టపరిహారం కింద రూ.10 లక్షలు చెల్లించుకునేందుకు ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో ఒప్పందం చేసుకున్నట్లు అర్థమవుతుందన్నారు. ఈ కేసు ఆధారం చేసుకొని మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు, వారి కుటుంబాన్ని అక్రమ కేసుల్లో ఇరికించాలనే దురుద్దేశంతో తెలుగుదేశం పార్టీ కనిపిస్తుందన్నారు. అప్పలరాజు కుమారుడు అరవ్ వర్మతో పాటు, అప్పలరాజు పై మరికొందరు తప్పుడు కేసులు నమోదు చేసి జైలు పాలు చేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు. సామాన్య మత్స్యకార కుటుంబం నుండి వచ్చిన డాక్టర్ సిదిరి అప్పలరాజు ఒక వైద్యుడిగా కళాశాలలోనే కాకుండా ఉత్తరాంధ్ర వ్యాపితంగా విశేష గుర్తింపు పొందిన నేత అన్నారు. అప్పలరాజుకు రోజురోజుకు పెరుగుతున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక రాజకీయంగా దెబ్బతీయాలని దురుద్దేశంతో యాక్సిడెంట్ కేసులు అక్రమంగా మూడు పెట్టారని ప్రజల్లో అభిప్రాయం వెలువడుతుంది అన్నారు. యాక్సిడెంట్ జరిగి ఐదు రోజుల తర్వాత కొండను తవ్వి ఎలుకను పట్టిన తీరుగా ఆరవ్ పై తప్పుడు కేసు నమోదు చేయడం దీనికి నిదర్శనం అన్నారు. సిద్ధార్థ తో ఒప్పందం కుదిరిన తర్వాత కూడా కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఈ కేసును అప్పలరాజు వారి కుటుంబ సభ్యులపై మళ్లించారన్నారు. ఇప్పటికే ఈ కేసును అడ్డం పెట్టుకొని అప్పలరాజు కుమారుడు అరవ్ వర్మ ను అరెస్టు చేసి జ్యూడిషియల్ రిమాండ్ కి పంపించారన్నారు. తాజాగా మూడో ముద్దాయిగా అప్పలరాజును చేర్చి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. గొర్రెల కాపర్లపై వల్ల మాలిన ప్రేమ చూపిస్తున్నట్లు చెప్పుకునే తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ప్రకాశం జిల్లా ఈదుముడి, నాగూర్ పులిపాడు మండలంలో గొర్రెల కాపరులను టిడిపికి చెందిన పెత్తందారులు దుర్భాషలాడి, కొట్టి, చిత్రహింసలకు గురి చేసిన ఒక కేసు నమోదు కాలేదు అన్నారు. వారికి అండగా నిలిచిన నాగార్జున యాదవ్ పై అక్రమ కేసులు పెట్టించి, తెలంగాణ పోలీసులు చేత అరెస్టు చేయించారన్నారు. ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ బీసీ కులాల మధ్య రెచ్చగొట్టి మత్స్యకారుల ప్రతినిధులతో రాజకీయ చదరంగం ఆడకుండా వెంటనే విరమించుకోవాలని హెచ్చరించారు. తక్షణమే అప్పలరాజు కుటుంబం పై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేసి, అప్పలరాజు కుటుంబాన్ని వేధించటం మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో రాజకీయంగా తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పట్టపు మత్స్యకారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వాయిల మోహన్‌రావు, అగ్నికుల క్షత్రియ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కే నాగయ్య, నాయకులు నాయుడు దొరబాబు, జాతీయ మత్యకార సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లపోతు గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# ధైర్యానికి, త్యాగానికి, మానవత్వానికి ప్రతీక కెప్టెన్ లక్ష్మీ సెహగల్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)**

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం కెప్టెన్ లక్ష్మీ సహగల్ 14వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి నగర కార్యదర్శి జి ఆదిలక్ష్మి మాట్లాడుతూ చేతిలో తుపాకీ పట్టి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడింది. చేతిలో స్టెతస్కోప్ పట్టి వేలాది ప్రాణాలను కాపాడింది. అదే కెప్టెన్ లక్ష్మీ సహగల్. ధైర్యానికి, త్యాగానికి, మానవత్వానికి చిరునామా కెప్టెన్ లక్ష్మీ సెహగల్ అన్నారు. కేవలం 28 ఏళ్ల వయస్సులో సింగపూర్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పిలుపుకు స్పందించి ఆజాద్ హింద్ ఫౌజ్లో చేరారు. భారత చరిత్రలో తొలి మహిళా యుద్ధ దళాల్లో ఒకటైన రాణి ఝాన్సీ రెజిమెంట్ ఏర్పాటుకు నాయకత్వం వహించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయుధం చేతబట్టి పోరాడిన ఆ వీరవనిత భారత మహిళల సాహసానికి సజీవ ప్రతీకగా నిలిచారు. స్వాతంత్ర్యం తర్వాత సైనిక దుస్తులను విడిచి వైద్య వృత్తిని ఎంచుకున్నారు. పేదల కోసం, శరణార్థుల కోసం, అనాథల కోసం, భోపాల్ గ్యాస్ విషాద బాధితుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. ఆమెకు వైద్యం ఒక వృత్తి కాదు, సమాజ సేవకు ఒక ఆయుధం. 1984లో కాన్పూర్‌లో మతకల్లోలాలు చెలరేగినప్పుడు, 70 ఏళ్ల వయస్సులోనూ నిర్భయంగా అల్లర్ల మధ్యకు వెళ్లి అమాయకులను రక్షించారు. నిజమైన ధైర్యానికి వయస్సు అడ్డంకి కాదని మరోసారి నిరూపించారు. ఆమె జీవితమంతా ఆర్థిక, సామాజిక సమానత్వం కోసం సాగిన నిరంతర పోరాటమే. విప్లవకారిణి, వైద్యురాలు, మానవతావాది, మహిళా సాధికారతకు ప్రతీక కెప్టెన్ లక్ష్మీ సహగల్‌ను మహిళలు, యువతులు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ముందుగా కెప్టెన్ లక్ష్మీ సెహగల్ చిత్రపటానికి ఐద్వా జిల్లా కోశాధికారి భావన రాజ్యలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు వై అంజనీదేవి, జి కళ్యాణి, కె కోటేశ్వరమ్మ, కె ఈశ్వరమ్మ, వి విజయ, పి లక్ష్మి, పి పద్మ, యస్ కాత్యాయని, ఎస్ నాగలక్ష్మి, అన్నపూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ చిన్నారులకు ఆధునిక సహాయక పరికరాల పంపిణీ

**ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేలా ప్రభుత్వం అండగా ఉంటుంది**
**ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**






**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 23)**

పట్టణంలోని జాషువా కళా ప్రాంగణంలో సమగ్ర శిక్ష "సహిత విద్య" విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై దివ్యాంగ బాలబాలికలకు వివిధ రకాల ఆధునిక సహాయక పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, బ్రెయిలీ కిట్లు, వాకర్లు, ఆధునిక బ్యాటరీతో పనిచేసే ఈ-వీల్ చైర్లను లబ్ధిదారులకు స్వయంగా అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో మమేకమై వారిని చదువులోనూ, జీవితంలోనూ ధైర్యంగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అనంతరం నిర్వహించిన సభలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం సమర్థులుగా ఎదగాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతతో కూడిన సహాయక పరికరాలను అందజేస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఈ-వీల్ చైర్లు బ్యాటరీతో పనిచేస్తాయని, ఒకసారి ఛార్జింగ్ చేస్తే కేవలం స్విచ్ నొక్కడం ద్వారా ఎలాంటి సహాయం లేకుండానే వారు తమకు కావలసిన చోటుకు సులభంగా వెళ్లగలరని వివరించారు. దివ్యాంగుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారికి సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, రవాణా వంటి అన్ని రంగాల్లో దివ్యాంగులకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇంకా అర్హత కలిగిన దివ్యాంగులు ఎవరైనా ఈ తరహా సహాయక పరికరాలు పొందకుండా ఉంటే తమ ఆధార్ కార్డు, సదరం ధ్రువీకరణ పత్రాలతో వినుకొండలోని శివశక్తి థియేటర్ సమీపంలో ఉన్న తమ పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మాచర్ల రూరల్ సిఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వేణును ఘనంగా సత్కరించిన డాక్టర్ కుక్కమూడి ప్రసాద్

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 23)**

మాచర్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సిఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వేణును గురువారం మాచర్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ కార్యాలయం నందు పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్, దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుక్కమూడి ప్రసాద్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్ట్ వెల్ఫేర్ ఎవేర్నెస్ ఆర్గనైజేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు గురజాల అప్పారావు ఆయనను శాలవాలతో ఘనంగా సత్కరించి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మాచర్ల రూరల్ కు యంగ్ డైనమిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా వేణు బాధ్యతలు చేపట్టటం సంతోషంగా ఉందన్నారు. మాచర్ల రూరల్ సర్కిల్ పరిధిలోని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,ప్రజలకు పోలీసులకు మధ్య స్నేహ పూర్వక సంబంధాలు ఉండే విధంగా చూడాలని, ఎస్సీ, ఎస్టీల పై దాడులు, అత్యాచారాలు జరిగినప్పుడు రిపోర్ట్ ఇచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ అయ్యేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లోని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, గ్రామాలలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు నివసించే ప్రాంతంలో యువత చెడు వ్యసనాలకు లోనవుతున్నారని, వారు అసాంఘిక కార్యక్రమాలకు ఆకర్షితులవుతున్నారని, అందుచేత పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అటువంటి ప్రాంతాలలో చట్టాల పట్ల అవగాహన కలిగే విధంగా, యువతను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టాలని ప్రతి నెల చివరి వారంలో గ్రామాల్లో నిర్వహించే పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమంలో పోలీస్ వారు హాజరయ్యే విధంగా చూడాలని సమస్యలను పరిష్కరించాలని ఆయనను కోరారు. సీఐ వేణు సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా ఆయనను సంప్రదించవచ్చునని ఆయన తెలియజేశారని ప్రసాద్ అన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# జ్యోతిరావుపూలే గురుకుల విద్యార్థులకు క్రీడా కిట్లు పంపిణీ

## విద్యార్థుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 23)

పట్టణంలోని జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన క్రీడా కిట్లను ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం భారీగా అప్పులు చేసి కూడా అభివృద్ధి పనులను పూర్తి చేయలేదని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ ఉద్యోగం కూడా భర్తీ చేయకుండావిద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసిందన్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడటంతో దాదాపు పది లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడి ఇతర పాఠశాలల్లో చేరడం లేదా చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి అవసరమైన నిధులు, స్థలాలు కూడా కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించి సామాజికంగా, విద్యాపరంగా ముందుకు తీసుకెళ్లడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. పాఠశాలల్లో వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని, ప్రభుత్వం నుంచి నిధులు అందించడమే కాకుండా వ్యక్తిగతంగా కూడా తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, ఉపాధ్యాయులు, వార్డెన్లు విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలల ఆటస్థలాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత నాయకత్వంలో రాష్ట్రంలో విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. పాఠశాలల్లో ఆటస్థలాల అభివృద్ధితో పాటు విద్యార్థులకు నాణ్యమైన క్రీడా కిట్లను అందిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి చిన్న వస్తువు పై రాజకీయ ప్రచారానికి ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించిన జీవీ ఆంజనేయులు, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఎలాంటి రాజకీయ ప్రచారం లేకుండా మహనీయుడు జ్యోతిరావు పూలే చిత్రపటంతో కూడిన నాణ్యమైన టీ-షర్టులు, క్రీడా కిట్లను విద్యార్థులకు అందజేస్తోందని చెప్పారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ప్రజాసేవకులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## డిప్యూటీ ఈవో జి సంజీవ్‌ని ఘనంగా సన్మానించిన డాక్టర్ షేక్ నాయబ్ రసూల్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జులై 23)

కనిగిరి డివిజన్ డిప్యూటీ డిఈవోగా పిసిపల్లి మండల విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న జి సంజీవ్‌ని జిల్లా విద్యాశాఖ అధికారి సామ సుబ్బారావు డిప్యూటీ ఈఓగా నియమించారు. ఈ సందర్భంగా పెదఇర్లపాడు హైస్కూల్లో స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉంటూ మంచి వ్యక్తిగా గుర్తింపు పొందిన జి సంజీవ్ కి పదవి లభించిన పట్ల అభినందనలు తెలిపారు. విద్యాభివృద్ధికి ఆయన సేవలు మరింతగా ఉపయోగపడాలని కోరారు. అనంతరం ఆయనకు పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్ సుభాన్, మండల విద్యాశాఖ అధికారి ఆర్ శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో పియం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం అమలు పై మాగుంట ప్రశ్న

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 23)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం, అన్ని జిల్లాలలో పియం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం అమలు, సర్వే, వ్యవసాయ యాంత్రీకరణ, వ్యవసాయ అనుబంధ రంగాలు, మెట్ట ప్రాంతాల అభివృద్ధి, లబ్దిదారులు, పథక అవగాహన కార్యక్రమాల గురించి ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్నాథ్ ఠాకూర్ సమాధానమిస్తూ కేంద్ర ప్రాయోజిత పదకాలన్నిటినీ “అభివృద్ధి పర్యవేక్షణ, మూల్యాంకన కార్యాలయం” ఆధ్యయనం చేసి శిఫార్సులతో కేంద్రానికి నివేదిక అందజేస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇచ్చిన సమాచారాన్ని బట్టి గత 5 సంవత్సరాలలో రాష్ట్రంలో మొత్తంలో వ్యవసాయ యంత్రాల సరఫరా క్రింద 1,00,295 మంది, వర్షాధార ప్రాంత అభిబృద్ధి క్రింద 23,584 మంది, వ్యవసాయ మౌలిక వసతులు క్రింద 1,38,92,692 మంది, భూమి సారవంత పద్దతుల క్రింద 13,08,469 మంది, సేంద్రీయ వ్యవసాయ ప్రోత్సహం క్రింద 37,86,259 మంది, ప్రత్యామ్నాయ పంటల సాగు క్రింద 47,168 మంది, తక్కువ నీటితో ఎక్కువ పంట క్రింద 3,77,374 మంది రైతులు లబ్ది పొందగా, ప్రకాశం జిల్లాలో వరుసగా 5,108 మంది, 6,809 మంది, 3,65,838 మంది, 70,054 మంది, 1,59,263 మంది, 13,618 మంది, 29,398 మంది లబ్ది పొందారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పియం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన తదితర అన్ని పథకాలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించుటకు, భూమి సారవంత పద్దతులను సమతుల్య ఎరువుల వినియోగం, భూసార పరీక్షలు, పంట మార్పిడి, ప్రకృతి వ్యవసాయం, నీటి లబ్యతనుబట్టి సమగ్ర వ్యవసాయ పద్దతులు, తక్కువ నీటితో ఎక్కువ పంట, అటవీ జాతుల మొక్కల గురించి, పొలం పిలుస్తుంది, తదితర కార్యక్రమాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ సిబ్బంది అమలు చేసి రైతులకు తెలియజేస్తారని కేంద్ర మంత్రి తెలియజేశారు.

## తెలుగుదేశం పార్టీలోకి వైసీపీ నేతల చేరిక కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి



(షణ్ముఖ వెలుగు, కారంచేడు, జులై 23)

కారంచేడు మండలం యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు (సాంబన్న) సమక్షంలో వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తాటిపర్తి వెంకటరెడ్డి, బోళ్ల జనార్ధన్‌రెడ్డి, శ్యామల శ్రీనివాసరెడ్డి, యర్రం బ్రహ్మరెడ్డి, యర్రం శ్రీనివాసరెడ్డి, భవనం హరిబాబు రెడ్డి, యర్రం వీరారెడ్డి ,యర్రం శ్రీనివాసరెడ్డి, తదితరులు పార్టీలో చేరారు. పార్టీ సిద్ధాంతాలు, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నామని నాయకులు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమల శెట్టి శ్రీహరి, షేక్ ఖాసిం, చిన్న నారాయణ, సురేంద్రబాబు, కోటిరెడ్డి, బంగారు బాబు, చంద్రశేఖర్, ఉదయ్, చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో జల జీవన్ మిషన్ నిధులు

### ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చొరవతో గ్రామాలకు రక్షిత మంచినీటి పథకాలు మంజూరు



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జులై 23)

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చొరవతో నియోజకవర్గంలోని పలు మండలాల్లో గ్రామీణ ప్రజలకు రక్షిత మంచినీరు అందించే లక్ష్యంతో జల జీవన్ మిషన్ (జేజేఎం) కింద భారీ ఎత్తున నిధులు మంజూరయ్యాయి. పర్చూరు, యద్దనపూడి, ఇంకొల్లు, చినగంజాం మండలాల పరిధిలోని పలు గ్రామాలు, హాబిటేషన్లకు సింగిల్ విలేజ్ స్కీమ్‌లు (ఎస్‌వీఎస్), మల్టీ విలేజ్ స్కీమ్‌లు (ఎంవీఎస్) కింద ఈ నిధులు కేటాయించారు.

**మండలాల వారీగా మంజూరైన పథకాలు**

యద్దనపూడి మండలం అనంతవరం జీపీలోని అనంతవరం హాబిటేషన్‌కు రూ.101.70 లక్షలు, సూరవరపుపల్లి జీపీలోని సూరవరపుపల్లి హాబిటేషన్‌కు రూ.110.70 లక్షలు, యద్దనపూడి జీపీకి రూ.263.70 లక్షలు, యనమదల జీపీలోని చింతపల్లిపాడు హాబిటేషన్‌కు రూ.139.50 లక్షలు మంజూరయ్యాయి. పర్చూరు మండలం ఏబీ పాలెం సహా మరో 15 హాబిటేషన్లకు ఎంవీఎస్ పథకం కింద రూ.397.80 లక్షలు, ఇనగల్లు జీపీకి రూ.146.70 లక్షలు, తన్నీరువారిపాలెం జీపీకి రూ.81 లక్షలు, పర్చూరు జీపీకి అత్యధికంగా రూ.1041.25 లక్షలు కేటాయించారు. ఇంకొల్లు మండలం ఇంకొల్లు జీపీలోని హాబిటేషన్‌కు రూ.994.33 లక్షలు మంజూరయ్యాయి. చినగంజాం మండలం రాజుబంగారుపాలెం, పెద్దగంజాం సహా మరో 20 హాబిటేషన్లకు ఎంవీఎస్ పథకం కింద రూ.477 లక్షలు, పెద్దగంజాం జీపీలోని కాటంవారిపాలెంకు రూ.61.65 లక్షలు, కొడూరివారిపాలెంకు రూ.58.95 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు నియోజకవర్గం మొత్తమ్మీద 12 పథకాలకు గాను సుమారు రూ.38.74 కోట్లు (రూ.3,874.28 లక్షలు) మంజూరైనట్లు ఎమ్మెల్యే ఏలూరి వివరించారు ఈ పథకాల ద్వారా ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించనున్నారు.

**ఎమ్మెల్యే ఏలూరి చొరవ...**

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా తాను నిరంతరం కృషి చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఈ పథకాలను నియోజకవర్గానికి తీసుకొచ్చానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. మంజూరైన పనులు త్వరితగతిన పూర్తి చేసి, గ్రామాలకు నీటి కష్టాలు లేకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## విద్యార్థులకు శక్తి టీం అవగాహన



(షణ్ముఖ వెలుగు, చీరాల, జులై 23)

చీరాలలోని బీఆర్‌కే హైస్కూల్‌లో శక్తి టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శక్తి టీం సభ్యురాలు సీహెచ్. సునీత విద్యార్థులకు శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, గంజాయి దుష్పరిణామాలు, మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలు, హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించి చదువుపై దృష్టి సారించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి రాధాకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యాయులు, సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం నిర్వహించిన శక్తి టీంకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

## 11వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ టోర్నమెంట్‌కు రిఫరీగా ఎంపికైన అఖిల్‌కు డీఎస్పీ సిహెచ్‌వి బాలసుబ్రహ్మణ్యం అభినందనలు




(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 23)

ఈ నెల 24 నుండి 26వ తేదీ వరకులి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరగనున్న 11వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ టోర్నమెంట్‌కు రిఫరీగా పి అఖిల్ ఎంపిక అయ్యారని రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, జిల్లా కార్యదర్శి మాస్టర్ ఎస్కే అబ్దుల్ సలాం తెలిపారు.సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (డీఎస్పీ) సిహెచ్‌వి బాలసుబ్రహ్మణ్యం తన కార్యాలయంలో ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు రిఫరీగా అఖిల్ ఎంపిక కావడం జిల్లా క్రీడారంగానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. అఖిల్ క్రీడా నైపుణ్యం, కృషి, అనుభవానికి నిదర్శనమని కొనియాడారు. ఇటువంటి విజయాలు ప్రకాశం జిల్లాకు గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రిఫరీగా సేవలందించి జిల్లా, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అఖిల్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా తైక్వాండో చైర్మన్ గోనుగుంట వెంకటేశ్వర్లు (తిమోతి) పాల్గొన్నారు.